క్లుప్తంగా

చాకరిమెట్లలో కార్తీక శోభ



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక శోభ సంతరించుకుంది. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ సార శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు దేవదత్తశర్మ, తదితరులు ఉన్నారు.

యువకుడిపై కేసు నమోదు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మద్యం మత్తులో ఓ యువకుడు పోలీసులను దుర్భాషలాడటమేకాకుండా ఓ కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని పక్కకు నెట్టిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన ఇలియాజ్ బేగ్ గ్రామంలో గొడవ జరుగుతోందని 100కు డయల్ చేశాడు. కాల్ రావడంతో చిట్కుల్ గ్రామానికి చేరుకున్న పోలీసులు కాల్ చేసిన వ్యక్తి గురించి ఆరాతీస్తుండగా, ఇలియాజ్ బేగ్ అక్కడికి వచ్చాడు. ఫోన్ చేస్తే ఇంత ఆలస్యంగా వస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కానిస్టేబుల్ ఫయాజ్ కాలర్ పట్టుకుని పక్కకు నెట్టాడు. పోలీసులపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఇలియాజ్ పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పోలింగ్ స్టేషన్‌లను సిద్ధం చేయాలి



చిట్కుల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీఓ, ఏపీఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, అన్ని వసతులతో పోలింగ్ స్టేషన్‌లను సిద్ధం చేయాలని ఎంపీఓ రమేష్, ఏపీఓ శ్యాంకుమార్ ఆదేశించారు. శనివారం వారు మండలంలోని చిట్కుల్ గ్రామంలోని పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రాల్లో తాగునీరు, ర్యాంపు, విద్యుత్, మరుగుదొడ్ల వసతులతో కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. అధికారుల వెంట సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

చేపల పెంపకంతో ఉపాధి



చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): చేపల పెంపకంతో ఉపాధి లభిస్తుందని మెదక్ ఫిషరీస్ ఫీల్డ్ ఆఫీసర్ మహమ్మద్ సలీం అన్నారు. శనివారం మండలంలో బిజిలిపురం వీరప్ప చెరువు, నవాబుపేట ఎర్రకుంట చెరువులో చేప పిల్లలను వదిలారు. 1.09 లక్షల చేప పిల్లలను చెరువుల్లో వదిలినట్లు గంగపుత్ర సంఘం సభ్యులు తెలిపారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



పెద్దశంకరంపేటలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): ఈనెల 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టారు. శనివారం బీఎల్ఓ, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ఓటరు స్లిప్పుల పంపిణీ చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో పంపిణీ ముమ్మరంగా కొనసాగుతోంది.

కొల్చారం(నర్సాపూర్): అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం మండల వ్యాప్తంగా చేపట్టారు. శనివారం ఆయా గ్రామాల్లోని బీఎల్ఓలు ఇంటింటికి తిరుగుతూ స్లిప్పులను అందజేస్తున్నారు. పంపిణీ కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారని తహసీల్దార్ గఫర్ మియా పేర్కొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో శనివారం ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ గియాసున్నీసా బేగం ప్రారంభించారు. బీఎల్ఓల సహకారంతో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్ యాదవ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల పరిశీలన

కౌడిపల్లి(నర్సాపూర్): ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు పరిశీలించారు. శనివారం మండలంలోని వెల్మకన్నలో సెక్టోరియల్ అధికారి, కౌడిపల్లి పీఆర్ డివిజన్ డిప్యూటీ ఈఈ అమరేశ్వర్ పరిశీలించారు. బీఎల్ఓలు అంగన్‌వాడీ టీచర్లు ప్రవల్లిక, అఖిల పోలింగ్ కేంద్రాలవారీగా ఇంటింటికి తిరుగుతూ ఓటరు స్లిప్పుల పంపిణీ తీరును అమరేశ్వర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అక్రమాలకు పాల్పడితే సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మాక్ పోలింగ్



నాగ్సాన్‌పల్లిలో ఆధార్ కార్డులు చూపుతున్న దృశ్యం



రుస్తుంపేటలో మాక్ పోలింగ్ దృశ్యం

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. నామినేషన్ దాఖలు, స్క్రూటినీ, ఎన్నికల చిహ్నాల కేటాయింపు, ఈవీఎంల వినియోగం, కౌంటింగ్ ప్రక్రియ తదితర విషయాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. 138 మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, ఏఎంఓ సుదర్శనమూర్తి, స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఆరోగ్యం, సురేందర్‌గౌడ్, హెచ్‌ఎం రాంకిషన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌రూరల్: నర్సాపూర్ మండలం రుస్తుంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికల నామినేషన్, పోలింగ్, ఓటింగ్ తదితర అంశాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు చెలిమెటి కృష్ణ, హెచ్‌ఎం కృష్ణమూర్తి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

క్షతగాత్రుడి వివరాలు తెలపండి



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

పెద్దశంకరంపేట(మెదక్): 161వ జాతీయ ప్రధాన రహదారిపై వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 13వ తేదీ రాత్రి పెద్దశంకరంపేట శివారులో నిజాంపేట నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు (టీఎస్ 07ఈడి8559) పాదచారిని ఢీకొనడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ బాలరాజు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని సంగారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని ఎస్ఐ తెలిపారు. బాధితుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. అతడి చేతికి కడియంతో పాటు అమ్మ అక్షరాలతో పచ్చబొట్టు ఉన్నట్లు చెప్పారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన



చెన్నాపూర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ భీమయ్య

శివ్వంపేట(నర్సాపూర్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా సిబ్బంది పనిచేయాలని డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ భీమయ్య అన్నారు. శనివారం మండలంలోని చెన్నాపూర్, చిన్నగొట్టిముక్కలలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం సేకరణ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని సకాలంలో తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సర్కారుతో గ్రామాల అభివృద్ధి



ఉప్పలింగాపూర్‌లో మహిళలతో నర్సాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సర్కారుతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు. శనివారం వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే తల్లులకు భరోసా, మహిళలకు రక్షణ ఉంటుందన్నారు. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా కేసీఆర్ సర్కార్ బీడీ కార్మికులకు పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి, ఇళ్లకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లకోసం వచ్చేవారి మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపిన కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

కేసీఆర్ ఔర్ ఏక్‌బార్ సీఎం పక్కా

మనోహరాబాద్(తూప్రాన్): కేసీఆర్ ఔర్ ఏక్‌బార్ సీఎం పక్కా అని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతశేఖర్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కూచారం, కాళ్లకల్ గ్రామంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఎలక్షన్‌రెడ్డి, భూపతిరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రైతులను పట్టించుకున్న పాలకులు లేరని, కేసీఆర్ వచ్చిన తర్వాత రైతులు బాగుపడ్డారని, ఆత్మహత్యలు లేవన్నారు. ప్రచారంలో పార్టీ నాయకులు పురం మహేష్, రమేష్‌గౌడ్, లక్ష్మీనర్సింహగౌడ్, సాయి, ఉదయ్‌రంజన్‌గౌడ్, రాంరెడ్డి, మహేష్, మధురావు, నాగిరెడ్డి, భిక్షపతి, ఇర్ఫాన్, గ్రామ అధ్యక్షుడు నరేష్, ఉప సర్పంచ్‌లు మహేందర్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, తుమ్మల రాజు, మాజీ సర్పంచ్ విఠల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని నార్సింగి, నర్సంపల్లి, తండా, వల్లూరు, భీంరావుపల్లి గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్ నాయకుడు, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి కుమారుడు పృథ్వీరెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. దుబ్బాక నుంచి గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అభివృద్ధికి పాటుపడలేదని ఆరోపించారు. 'కారు' గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

తప్పుడు ఆరోపణలపై చర్యలు తీసుకోవాలి

ఈసీకి ఫిర్యాదు చేసిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): తప్పుడు ఆరోపణలతో ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ఇఫ్‌కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారంరాత్రి పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రామాయంపేట రెవెన్యూ డివిజన్, డిగ్రీ కళాశాల ఏర్పాటుపై హామీ ఇచ్చి ప్రజలను మోసగించారని కరపత్రంలో ఆరోపించడం సిగ్గుచేటని, రెవెన్యూ డివిజన్, డిగ్రీ కళాశాల మంజూరయ్యాయన్నారు. అలాగే కోనాపూర్ సహకార సంఘంలో భారీ అవినీతి జరిగిందని ముద్రించారని, ఈ కేసులో గుర్తించిన 11 మందిపై చర్యలు తీసుకోవాలని తామే సిఫార్సు చేశామని గుర్తుచేశారు. ఓడిపోతామన్న భయంతో కాంగ్రెస్ నాయకులు చిల్లర పనులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఆరోపణలపై ఈసీకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.



కరపత్రాలు చూపుతున్న దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి..



మనోహరాబాద్‌లో విస్తరాకుల దుకాణాన్ని ప్రారంభిస్తున్న మహిళా సమాఖ్య సంఘం సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): మహిళలు ఆర్థికంగా ఎదగడానికి మహిళా సమాఖ్య సంఘాలు దోహదపడుతున్నాయని మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న శనివారం అన్నారు. మనోహరాబాద్‌లో గ్రామానికి చెందిన మహిళకు బ్యాంకు రూ. 2 లక్షల రుణం మంజూరు చేసిందని, దీంతో విస్తరాకుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ భీమయ్య, సీసీ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి రూపగౌడ్, మహిళా సమాఖ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తున్న గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని సదాశివపల్లిలో కార్తీక మాసం పురస్కరించుకొని శనివారం శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో గ్రామస్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. అలాగే స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ శోభ, మాజీ సర్పంచ్ వీరయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇళ్లలో సోదాలు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో పీసీసీ సభ్యుడు సుప్రభాతరావు, మరో నాయకుడు ఎనిశెట్టి అశోక్ ఇళ్లలో శనివారం రాత్రి పోలీసులు సోదాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలతో కరపత్రాలు విడుదల చేశారని బీఆర్‌ఎస్ నాయకుడు దేవేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు సోదాలు చేపట్టినట్లు తెలిసింది. కాగా పోలీసుల సోదాలపై కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

రోజురోజుకు బీజేపీకి ప్రజాదరణ

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్‌లో బీజేపీకి ప్రజాదరణ పెరుగుతోందని, భారీ మేజార్టీతో ఈటల రాజేందర్ విజయం పక్కా అని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్ అన్నారు. శనివారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ హామీలను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు కమ్మరి నరేందర్‌చారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిమిషాల వ్యవధిలో రెండు కండువాలు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలో శనివారం విచిత్ర ఘటన జరిగింది. కాంగ్రెస్ ప్రచారం చేస్తున్న సమయంలో మండలంలోని మెల్లూర్ సర్పంచ్ పంబల్ల లక్ష్మి స్థానిక పోచమ్మ దేవాలయం వద్ద నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో హుషారుగా పాల్గొన్నారు. హనుమాన్ టెంపుల్ వద్ద జరిగిన సమావేశంలోనూ పాల్గొన్నారు. కాగా ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నిమిషాల వ్యవధిలోనే గ్రామానికి చెందిన ఓ బీఆర్‌ఎస్ నాయకుడు కారులో వచ్చి సర్పంచ్ లక్ష్మిని తీసుకెళ్లి రామాయిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడి సమక్షంలో తిరిగి బీఆర్‌ఎస్‌లో చేర్పించారు. నిమిషాల వ్యవధిలో కండువాలు మారడంపై చర్చించుకుంటున్నారు.



సర్పంచ్ లక్ష్మికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న రాజిరెడ్డి



గులాబీ కండువా కప్పుతున్న సునీతారెడ్డి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి:ఆవుల రాజిరెడ్డి

- విజయోత్సవ ర్యాలీని తలపించిన కాంగ్రెస్ ప్రచారం



వెల్దుర్తిలో ప్రజలకు అభివాదం చేస్తున్న రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రమైన వెల్దుర్తిలో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి ఎన్నికల ప్రచారం విజయోత్సవ ర్యాలీని తలపించింది. మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన అనంతరం సాయంత్రం వెల్దుర్తి బస్టాండ్ వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి గంగపుత్ర కాలనీ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ చేపట్టారు. వందల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డికి మద్దతుగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గమైన అవినీతి పాలన కొనసాగుతోందన్నారు. ఇందుకు వెల్దుర్తి మండలం మెల్లూర్‌లో జరిగిన సంఘటన నిదర్శనమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పనితీరుతో విసుగుచెంది సర్పంచ్ పంబల్ల లక్ష్మి కాంగ్రెస్‌లో చేరిన రెండు గంటల్లో బలవంతంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తీసుకెళ్లి మళ్లీ కండువా కప్పి బలవంతంగా పార్టీ మార్చడం దారుణమన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పెద్దశంకరంపేట(మెదక్): ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజేందర్‌గౌడ్, జైహింద్ రెడ్డి, ఆర్ఎన్ సంతోష్, లక్ష్మణ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూకుట్లపల్లిలో కాంగ్రెస్ బైక్ ర్యాలీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కూకుట్లపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి తరఫున ఆ పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. శనివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇక్బాల్, ఉపాధ్యక్షుడు పెద్ద యాదగిరి, యూత్ అధ్యక్షుడు శేఖర్, నాయకులు, ఎం.యాదగిరి, ఏసు, అనిల్ తదితరులు గ్రామంలో బైక్ ర్యాలీ తీశారు. హస్తం గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

కాంగ్రెస్ ముమ్మర ప్రచారం

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ సీనియర్ నాయకులు సుహాసిని రెడ్డి, కమల, సుదర్శన్‌గౌడ్, నవీన్‌గుప్తా అన్నారు. శనివారం నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డికి మద్దతుగా మండలంలో గుండ్లపల్లితో పాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

నర్సాపూర్‌లో కాంగ్రెస్ జెండా..

కొల్చారం(నర్సాపూర్): జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి అన్నారు.

ఇంటింటికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలు

- మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



మిర్జాపల్లిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



శేరిపల్లిలో బోనాలతో పద్మాదేవేందర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

చిన్నశంకరంపేట(మెదక్): ఇంటింటికి ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకి దక్కిందని, ప్రజలు ఆశీర్వదించి మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలని మెదక్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఓటర్లను కోరారు. శనివారం చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి, మిర్జాపల్లితండా, కామారం, కామారంతండా, అంబాజిపేట, సంగాయిపల్లి, ఉమ్మడి మండలంలోని శేరిపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే రైతులకు మేలు జరుగుతుందని, ప్రజలు మరోసారి ఆశీర్వదించి గెలిపించాలన్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమాతో పాటు తాజాగా ప్రతీ ఇంటికి బీమా కల్పించనున్నట్లు తెలిపారు.

రెండుసార్లు గెలిచినా అభివృద్ధి శూన్యం

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లిలో మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనంపల్లి హన్మంతరావు రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో మెదక్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. కొర్విపల్లిలో ఆసుపత్రి నిర్మిస్తామని హామీ ఇచ్చిన మైనంపల్లి మోసగించాడని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌కు రోజుకు ఎన్ని గంటలో కూడా తెలియదన్నారు. బాధ్యత, అనుభవంలేని వ్యక్తికి అధికారం ఇస్తే ఏం అభివృద్ధి చేస్తాడని ప్రశ్నించారు.

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో పలువురు శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మిర్జాపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యేను కలిసిన మెదక్ ఆటో అసోసియేషన్ సభ్యులు బీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించి పార్టీలో చేరారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

హవేళిఘణాపూర్(మెదక్): బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిని తిరిగి గెలిపించుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి మాణిక్యరెడ్డి అన్నారు. శనివారం గాజిరెడ్డిపల్లితోపాటు ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అలాగే మంభోజిపల్లిలో సర్పంచ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.